పల్లె రహదారులు ప్రమాదకరం


రాళ్లుతేలిన కండ్లకుంట రోడ్డు

- అధ్వానపుదారుల్లో ప్రయాణం నరకమే..
- బీటీరోడ్లు మంజూరు చేయాలని డిమాండ్

అమ్రాబాద్: మట్టి రోడ్లకు బీటీ వేయకపోవడంతో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై నడిచేందుకు వీలు లేకుండా పోతోంది. ఫలితంగా ప్రయాణం నరకయాతనగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అమ్రాబాద్ మండలంలోని మొల్కమామిడి గ్రామంతో పాటు చెంచు పెంటలకు వెళ్లే మల్లాపూర్‌పెంట, పుల్లాయపల్లి, సార్లపల్లి, కుడిచింతలబైలు తదితర పెంటల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పదర మండలం కోడోనిపల్లి, పల్లెరూట్‌పెంట, కండ్లకుంట తదితర గ్రామాలకు ఇంకా మట్టిరోడ్లే ఉన్నాయి. ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు కోట్లు వెచ్చించి ఎంతో కృషి చేసినప్పటికీ గ్రామాల రోడ్లు దుస్థితిలో ఉన్నాయి. ప్రయాణించే ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. బీటీ రోడ్లు లేక పోవడంతో ఆర్టీసీ బస్సులు సైతం నడపడం లేదు. ప్రైవేట్ వాహనాలు గ్రామాల్లోకి రాక


అధ్వానంగా ఉన్న పల్లెరూట్‌పెంట రోడ్డు

పోవడంతో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, సరుకులు తేవాలన్నా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేతల హామీలు నీటిమూటలే..

గ్రామాలకు బీటీ రోడ్లు వేయించాలని ఎన్నో మార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఎన్నికల సమయంలో వచ్చిన నాయకులంతా రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చి, గెలిచాక పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఎప్పటి నుంచో ఇవే బాధలు..



మద్దిమడుగు రోడ్డు నుంచి కిలోమీటరు పైన మా పెంట ఉంది. అందరూ వచ్చి చూసి పోతారు. రోడ్డు బాగు చేయించరూ. బస్సు దిగి సురుకులు తీసుకు పోవాలన్నా, సరుకులు అమ్మేందుకు బస్సు ఆగే వద్దకు తేవాలన్నా నెత్తిమోతలు తప్పవు. ఇప్పటికై నా బీటీరోడ్డు వేయిస్తే బాగుంటుంది.

– గంగయ్య, పల్లెరూట్‌పెంట

ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం..

ఇటీవలనే రెండు గ్రామాలకు బీటీ రోడ్లు వేశాం. గ్రామీణ ప్రాంతాలకు బీటీ రోడ్లు వేయాలని ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదికలు అందజేశాం. మంజూరు కావాల్సి ఉంది. నిధులు రాగానే పనులు చేపడతాం.

– శ్రీనివాసులు, పీఆర్‌ఏఈ, అమ్రాబాద్

క్లుప్తంగా

అమావాస్య పూజలు

తెలకపల్లి: భక్తిశ్రద్ధలతో మహలయ అమావాస్య పూజలు నిర్వహించారు. తమ పూర్వికులైన పెద్దలకు మహలయ అమావాస్య సందర్భంగా ఇంటి ల్లిపాది ఫొటోలు ఉంచి వారికి నైవేద్యం సమర్పించారు. మండల కేంద్రం తెలకపల్లితో పాటు అన్ని గ్రామాల్లో ఈ మహలయ అమవాస్య నిర్వహించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసు ప్రవర్తన

నాగర్‌కర్నూల్ క్రైం: ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై కారు యజమాని దురుసుగా ప్రవర్తించిన సంఘటన జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఓ కారు యజమాని కారును నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫైజల్ కారును తీయమని సూచించారు. దీంతో కారు యజమాని దురుసుగా ప్రవరిస్తూ దూషించాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కారుయజమాని నుంచి కారు తాళం తీసుకునే క్రమంలో చేతివేలికి కారు తాళం తగిలి తీవ్ర రక్తస్రావమైంది. సంఘటనపై ట్రాఫిక్ ఎస్‌ఐ కల్యాణ్‌ను వివరణ కోరగా, ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన కారు యజమానిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని, చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేడు వాహనాల వేలం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి సమక్షంలో వాహనాల వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి ప్రాంతంలో ఎక్సైజ్ దాడుల్లో పట్టుబడ్డ టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ వాహనాలను సోమవారం వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొని వాహనాలను కొనుగోలు చేయొచ్చని సీఐ పేర్కొన్నారు.

అన్న ప్రసాదం వితరణ



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహాలయ అమావాస్య సందర్భంగా ప్రయాణికులకు ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. ప్రతి అమావాస్యకు బస్టాండ్ లో అన్నదానం చేస్తున్నామని నిర్వాహకులు అప్పాయిపల్లి శ్రీను, ముత్యాలు తెలిపారు. 600 మంది ప్రయాణికులకు భోజనం అందించారు.

బీజేపీ నాయకుల భిక్షాటన



ఉప్పునుంతల: మండలంలోని రాయిచెడ్‌లో వీధిలైట్ల ఏర్పాటు కోసం ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో యువకులు మట్టి కుండ పట్టుకొని గ్రామంలో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మొగిలి అంజి మాట్లాడుతూ రాయిచెడ్‌లో వీధి లైట్లు వేయడంలో నిర్లక్ష్యం చేస్తుండటంతో రాత్రిళ్లు వీధుల వెంట నడవడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీష్, మధు, తిరుపతి, శ్రీను, రాజేష్, శివ, బాల్‌రాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత



ఉప్పునుంతల: ఆవు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృత్యువాత పడిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాంసానిపల్లికి చెందిన గజ్జె శేఖర్ గౌడ్ ఆదివారం సాయంత్రం తన పొలంలో మేత మేస్తున్న ఆవు విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడింది. ఆవు విలువ రూ.90 వేలు ఉంటుంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు, తోటి రైతులు కోరుతున్నారు.

పాతపాట.. కొత్త చర్చ

తాడూరు: మండల కేంద్రంలోని కూచకుళ్ళ సౌభాగ్య జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే సందర్భంగా కళాశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన పాటకు విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా చిందులు వేయడంతో ఆ వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విద్యాసంస్థల్లో కూడా ఇటువంటి పాటలకు నృత్యాలు చేయడం ఎంత వరకు సమంజసమని పలువురు చర్చించుకుంటున్నారు.

చేయిచేయి కలిపారు.. చెరువు నీళ్లు ఆపారు

తిమ్మాజిపేట: నాయకులు లేరు అధికారులు అంతకన్నా లేరు కాని రైతులు చేయిచేయి కలిపి చెరువు నుంచి నీళ్లు వృథా పోకుండా ఆపగలిగారు. రైతుల కృషిని గ్రామస్తులు అభినందించారు. మండల పరిధిలోని ఆవంచ పెద్దచెరువు పిట్టలోని తూము దగ్గర రంధ్రం పడడంతో గమనించిన చుట్టు పక్కల రైతులు వచ్చి వరిగడ్డి, సంచులలో ఇసుక, మట్టి నింపి రంధ్రం వద్ద వేశారు. తాత్కాలికంగా చెరువు నీళ్లు బయటకు వెళ్లకుండా ఆపారు. తూము దగ్గర రంధ్రం పడి గండి పడే ప్రమాదం ఉందని తహసీల్దారుకు, ఇరిగేషన్ డీఈ, ఏఈలకు సమాచారం ఇస్తే సోమవారం వచ్చి చూస్తామని తెలిపారు. గండి పడి నీళ్లు పోయాక వచ్చి చూస్తారా? అంటూ పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు.


పెద్ద చెరువు తూము వద్ద రంధ్రం పూడ్చిన రైతులు

గ్రామం నుంచి కోతులను తరలించాలి



వెల్దండ: మండల కేంద్రంలోని పోస్టాఫీసు ఆవరణలో గ్రామస్తుల సమక్షంలో ఆదివారం కోతుల బెడదను నిరవాణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కోతులు అధికం కావడంతో తరచుగా గ్రామస్తులపై దాడిచేసి గాయపరుస్తున్నట్లు తెలిపారు. కోతుల నివారణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ప్రత్యేకమైన నిపుణలతో కోతులను పట్టించాలని తీర్మానం చేశారు. కోతుల నివారణ కమిటీకి సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎర్రశ్రీను ముదిరాజ్, గ్రామ పెద్దలు, తదితరులు ఉన్నారు.

పేద ప్రజలకు అండగా ఎర్రజెండా


కల్వకోలులో సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న కోళ్ల యేసయ్య

తెలకపల్లి: పేద ప్రజలకు అండగా ఉంటూ నిరంతరం ఉద్యమాలు చేస్తూ వారి సంక్షేమానికి పాటుపడుతుందని సీపీఐ అని జిల్లా నాయకులు శంకర్ గౌడ్, మండల కార్యదర్శి వెనేపల్లి రవీందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు గౌరెడ్డిపల్లి, అలేరు, పెద్దపల్లి, గట్టురాయిపాకుల గ్రామాల్లో సీపీఐ జాతీయ మహాసభల ప్రారంభ సూచికగా సీపీఐ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఆంజనేయులు, విష్ణు, బుగ్గస్వామి, బిచ్చయ్య, నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: చండీఘర్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభలకు కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లి జయప్రదం చయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోళ్ల యేసయ్య అన్నారు. ఆదివారం కల్వకోలు గ్రామంలో సీపీఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. చండీఘర్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభలకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున తరలివెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణ, లక్ష్మీనారాయణ, స్వామి, వెంకటస్వామి, శివకుమార్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల బైక్ ర్యాలీ

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో సీపీఐ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. సీపీఐ 25వ జాతీయ మహాసభల సందర్భంగా పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. మండల కార్యదర్శి తుమ్మల శివుడు సీపీఐ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో జంగం శివుడు, చందు, శంకర్, వెంకటస్వామి, తిరుపతయ్య, వెంకటరమణ, రమేష్, దామోదర్, సుంకన్న, మజార్ తదితరులున్నారు.

మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

కొల్లాపూర్: మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు జబ్బార్ వెల్లడించారు. ఆదివారం కొల్లాపూర్‌లో ఆ సంఘ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కారు ముస్లిం, మైనార్టీలపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. ఇది భారతీయ సమాజానికి తీరని ద్రోహమన్నారు. కార్యక్రమంలో శివవర్మ, శంకర్, మహిమూద్, వల్లి మాలిక్, ముంతాజ్, రబ్బానీ, బషీర్, ఆరీఫ్, ఖాదర్‌పాషఉన్నారు.

పదోన్నతులు కల్పించడంలో పీఆర్టీయూ కృషి



తిమ్మాజిపేట: ఉపాధ్యాయులకు ప్రభుత్వం పదోన్నతులు కల్పించడంలో తెలంగాణ పీఆర్టీయూ కృషి ఎంతో ఉందని జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి అన్నారు. మండలానికి పదోన్నతిపై వెళ్లిన, వచ్చిన వారిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఉపాధ్యాయులకు గతేడాది, ఈ సంవత్సరం బదిలీలు, పదోన్నతులు ఇప్పించిన సంఘంగా పీఆర్టీయూకే ఆ ఘనత దక్కిందన్నారు. బదిలీపై వెళ్లిన నందకిశోర్, లక్ష్మీనారాయణ, రాధకృష్ణ, పవన్, బదిలీపై వచ్చిన సాయిరెడ్డిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరాం గౌడ్, సాంబయ్య, అశోక్, శివశంకర్, రాజు ఉన్నారు.

దసరా ఉత్సవాల పుస్తకావిష్కరణ


వాసవీ దేవాలయంలో ఉత్సవాల పుస్తకావిష్కరణ చేస్తున్న కమిటీ సభ్యులు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవాలపై ముద్రించిన పుస్తకాన్ని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గందె రవి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంధం ప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వాస శేఖర్, మాజీ ఎంపీటీసీ కల్మిచర్ల గోపాల్, ఉత్సవ కమిటీ కార్యదర్శులు గుండ్ల రేవంత్, దాచేపల్లి నితిన్, కోశాధికారులు గిరిబాబు, తరుణ్, గంప వెంకటేష్, ముత్యాలు, కిషన్, ప్రవీణ్, అప్పయ్యపల్లి శీను, సామల నరసింహ, కృష్ణయ్య, శంకర్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు కొనసాగుతున్న శిక్షణ



ఉప్పునుంతల: జిల్లా స్థాయి కబడ్డీ 35వ సబ్ జూనియర్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు వారం రోజులుగా మండలంలోని వెల్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన నాయకులు, యువకులు క్రీడాకారులకు అవసరమైన భోజనం, ఇతర వసతులు కల్పించి సహకరిస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన శ్రీనివాసు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. శిక్షణ కోసం వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, యువకులు బాలరాజు, సమ్మద్, రాము, నాగార్జున, రాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

కొండా లక్ష్మణ్ జీవితం అందరికీ ఆదర్శం


కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ తొలి మలిదశ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం అందరికీ ఆదర్శమని బీసీ సబ్ ప్లాన్ సాధన సమితి నియోజకవర్గ కన్వీనర్ రాజేందర్ అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడమ సత్యం, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, మాజీ సర్పంచ్ ఆనంద్, రమేష్, మధు, రమేష్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లిలో మహిళలు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలో పలు రకాల పూలను తీసుకొచ్చి ఇంటి వద్ద రంగుల రంగుల పూలతో బతుకమ్మలు అందంగా అలంకరించారు. బతుకమ్మలను ఎత్తుకొని డప్పులు, వాయిద్యాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. విశ్వనాథ ఆలయం వద్ద బతుకమ్మలను ఉంచి మహిళలు బతుకమ్మ వేశారు. అనంతరం దేవుని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు తిరుపతమ్మ, మంజుల, మహిళలు రజిత, లక్ష్మీదేవి, ప్రసన్న పలువురు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అల్లాపూర్, మేడిపూర్ పాఠశాలల ఆవరణలో మహిళలు, పురుషులనే తేడా లేకుండా ఉదయం నుంచే వివిధ రకాల పూల తో బతుకమ్మ తయారు చేసి వేడుకలు నిర్వహించారు.


అప్పాజిపల్లిలో బతుకమ్మలతో మాజీ సర్పంచులు, మహిళలు


అల్లాపూర్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న గ్రామస్తులు

శ్రీనివాస శ్రీదేవి, భూదేవి విగ్రహాల వితరణ

అచ్చంపేట: అచ్చంపేట పట్టణంలోని లింగాల రోడ్డులో వెలిసిన శ్రీవేంకటేశ్వర ఆలయంలో ఈనెల 23 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా ఆదివారం రూ.2లక్షల వ్యయంతో శ్రీనివాస కల్యాణం కోసం శ్రీనివాస శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలను దాతలు బంధం బాల్‌నారాయణ, పెద్ది కన్నయ్య, బుద్దుల శ్రీను, బుద్దుల వెంకటేష్, బలుసా అశోక్‌లు అందజేశారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం విగ్రహాలను దాతలు ఆలయ అర్చకులు, నిర్వహకులు గోపిశెట్టి శివలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బంధం రాజు, కౌన్సిలర్ అప్ప శివ, వెన్ను కాశీనాథం, శివ, శివకృష్ణ ఉన్నారు.


ఉత్సవ విగ్రహాలు అందజేస్తున్న దాతలు

బతుకమ్మతో హాస్టల్ వర్కర్ల నిరసన

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో బతుకమ్మలతో హాస్టల్ వర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఎస్టీ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం బతుకమ్మలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ వర్కర్లను సీనియారిటీ ప్రాతిపదికన పర్మినెంట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివవర్మ, నాయకులు సలీం, శివశంకర్, బాలపీరు, రాజు, సంజీవ్, పవన్‌కుమార్ ఉన్నారు.


కార్యక్రమంలో హాస్టల్ వర్కర్లు

నీట్ విద్యార్థులకు సన్మానం

బల్మూర్: మండల కేంద్రానికి చెందిన రేకుల రేణయ్య, స్వప్న దంపతుల కుమారులు ఇద్దరు వైద్య విద్యలో ప్రతిభ చాటి కుటుంబానికి, గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. దంపతుల మొదటి కుమారుడు ముఖేష్ మూడేళ్ల క్రితం నీట్ పరిక్షలో మెడికల్ సీటు సాధించి ప్రస్తుతం నాగర్‌కర్నూల్ ప్రభుత్వం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. తాజాగా నీట్–2025లో చిన్న కుమారుడు యశ్వంత్‌కుమార్ 493 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 741 ర్యాంక్‌తో పాలమూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సిట్ పొందాడు. తండి రేణయ్య ఆర్టీసీలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి స్వప్న బీఈడీ పూర్తి చేసి గృహిణిగా ఉంది. వారి విజయం గ్రామ యువతకు స్ఫూర్తిదాయకమని బల్మూర్ యూనియన్ బ్యాంక్ మెనేజర్ పవన్ శాలువాతో సత్కరించి అభినందించారు.

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన విద్యార్థిని దసరాజు శృతి మెడిసిన్‌లో సీటు సాధించింది. ఆమెకు గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తూ శృతిని అభినందించారు.

మన్ననూర్: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన నల్లమల విద్యార్థులను అచ్చంపేట మాల మహానాడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి అమ్రాబాద్ మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన ఎనుపోతుల నిరంజన్, గోపాలమ్మల కుమారుడు అఖిల్, ఎల్మపల్లి గ్రామానికి చెందిన జ్యోతి, కృష్ణయ్య కుమారుడు అఖిల్ ఇరు కుటుంబ సభ్యులను కలిసి శాలువా, పూల బొకేలతో సన్మానించారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామ విద్యార్థిని బచ్చలకూర అరుందతికి యంబీబీఎస్‌లో సీటు రావడంతో స్వేరో వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్ స్వేరో మాట్లాడారు. కార్యక్రమాలలో స్వేరో కమిటీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న మహానాడు నాయకులు


నీట్‌లో సీటు సాధించిన తమ కుమారులతో స్వప్న, రేణయ్య దంపతులు

కోటిలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో శ్రీ దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ఏకరుద్రాభిషేకం నిర్వహించినట్లు నిర్వాహకులు శేఖరయ్య అన్నారు. పరమశివుడి జన్మనక్షత్రమైన ఆరుద్రనక్షత్రం సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ఏకదశ రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు విఘ్నేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం చేశారు. భక్తులు ఉదయం నుండి అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని ఆలయంలో గల శివలింగానికి పాలాభిషేకం చేసి, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో రుద్ర హోమాన్ని నిర్వహించారు. హోమంలో భక్తులు పాల్గొని నెయ్యి హోమద్రవ్యాలు వేసి హోమం చేశారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించి కూష్మాండ బలిచ్చి మహామంగళహారతి సమర్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


రుద్రాభిషేకం పూజల్లో పాల్గొన్న భక్తులు

వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం దగ్గర ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గుట్టపై ఉన్న ఆలయంలో స్వామి వారికి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్ట కింది బాగాన కర్నాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా చిక్కుసూగూర్‌కు చెందిన వాస శ్వేత శ్రీనివాసశెట్టి వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు పూజా కార్యక్రమాలతో పాటుగా అన్నదాన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న యువకులు